క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన మంగతాయారును గురువారం మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

జోగిపేట(అందోల్): పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు సెల్ గదులు, సిబ్బంది కూర్చునే స్థలం, సీసీ కెమెరాలను పర్యవేక్షించే గదులను ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గౌస్, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


రవి

జిన్నారం(పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన ఘటన జిన్నారంలో పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన పల్లపు రవి లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న విధులు నిర్వహించేందుకు హైదరాబాద్‌కు వెళ్లి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛ్ ఆఫ్ రావడంతో రవి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి దర్గా ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ సమీపంలోని ఉర్సెషరీఫ్ పిర్‌గైబ్ సాహెబ్ దర్గాలో నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు కర్నాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా ఝరాసంగం, రాయికోడ్, జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజలతో మమేకం కావాలి

సంగారెడ్డి టౌన్: ప్రజలతో మమేకమై ప్రతిఒక్కరికీ పోస్టల్ శాఖ పథకాలు చేరవేయాలన్నదే డీసీడీపీ ముఖ్య ఉద్దేశమని సంగారెడ్డి పోస్ట్ మాస్టర్ సురేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో గురువారం ప్రారంభించారు. అంతకుముందు సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీసీ పీఎల్‌ఐ మేనేజర్ వనజ, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

హత్నూర (సంగారెడ్డి): జెన్వాడ దళితులపై దాడి అమానుషమని అల్ ఇండియా అంబేడ్కర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల మల్లేశం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జెన్వాడ గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ గుండాలు, వీరికి సహకరించిన పెత్తందారులపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌సీటీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాస్ గురువారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటరమణ, రాంరెడ్డి, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో నల్లా ట్యాప్స్ చోరీ

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలోని వాష్‌రూమ్‌లో నుంచి 40 నల్లాలను(ట్యాప్స్) గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. హెచ్‌ఎం జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని బాత్ రూమ్‌లలో 40 నల్లాలను (ట్యాప్స్) గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి వచ్చి చోరీ చేశారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి బాత్ రూమ్‌లలో నల్లాలు కనిపించకపోవడంతో పాఠశాల హెచ్‌ఎం గురువారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జా కోరల్లో నక్ష బాట

- రాకపోకలకు వీలు లేకుండా సిమెంట్ పలకల ఏర్పాటు
- కనుమరుగవుతున్న సర్వీసు రోడ్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


నక్ష బాటను కబ్జా చేసి ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు

హత్నూర(సంగారెడ్డి): పూర్వం కాలినడక నడిచేందుకు ఉండే నక్ష రోడ్లు సైతం కబ్జాలకు గురవుతున్నాయి. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో దూరభారం తగ్గేందుకు గ్రామాలను కలుపుకొని నక్ష రోడ్డు మార్గాలు కబ్జాకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామ శివారులోని సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న నక్ష రోడ్డును కొందరు వ్యక్తులు కబ్జా చేసి రాకపోకలకు వీలు లేకుండా అడ్డంగా సిమెంట్ పలకలను ఏర్పాటు చేశారు. కాసాల గ్రామ శివారులోని సర్వే నెంబర్ 326/ఆ/2లోని నుంచి కొన్ని దశాబ్దాలుగా నక్షబాట ఉండేది. ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో నక్షబాటపై కన్నేసిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి అడ్డంగా సిమెంటు పలకలను ఏర్పాటు చేశారు.

చోద్యం చూస్తున్న అధికారులు

దౌల్తాబాద్ నుంచి నస్తీపూర్ ముచ్చర్ల షాదుల్లానగర్ వరకు ఈ నక్ష బాట దశాబ్దాల క్రితం నుంచి ఉంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనప్పుడు ఈ రోడ్డు గుండా హైదరాబాదు నుంచి పటాన్‌చెరు మీదుగా వచ్చే బస్సు సర్వీసులు సైతం ఈ నక్ష రోడ్డు గుండా వెళ్లేవి. నక్ష బాట కబ్జా విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్వం నుంచి ఉన్న నక్షబాటను కబ్జాదారుల నుంచి కాపాడి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వం నుంచే నక్ష బాట ఉంది



దౌల్తాబాద్ నుంచి నస్తిపూర్ గ్రామానికి పూర్వం నుంచే ఈ నక్షబాట వెంట కాలినడకన వెళ్లేవాళ్లం. ఇప్పుడు భూముల రేట్లు పెరగడంతో ఈ నక్ష బాటను కొంతమంది కబ్జా చేశారు. అధికారులు వెంటనే స్పందించి నక్ష బాటను కాపాడాలని కోరుతున్నం.

– తోట రాములు మాజీ సర్పంచ్, నస్తిపూర్

ప్రగతి నివేదికలు లేకుండానే హాజరు

- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం
- అధికారుల గైర్హాజరుపై ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు


తహసీల్దారు శ్రీనివాస్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ నర్సింలు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి రైతువేదిక భవనంలో మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగానే సాగింది. ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి కొందరూ అధికారులు వచ్చామా.. వెళ్లామా అన్నట్లుగా ప్రగతి నివేదికలు లేకుండానే సభకు హాజరై వారికి తోచిన విధంగా మాట్లాడడం సభ్యులను అసహనానికి గురిచేసింది. విద్యుత్, మార్కెట్ కమిటీ, ఆర్‌అండ్‌బీ, సంక్షేమం, ఎక్సైజ్, అటవీశాఖ, ఉద్యానవన తదితర శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎదురవుతుండటంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలని ఎంపీటీసీ నర్సింలు వాపోయారు. తహసీల్దారు శ్రీనివాస్ ప్రగతి నివేదిక ఇవ్వకపోవడంపై ఎంపీడీఓ శశిప్రభ ప్రశ్నించారు. అనంతరం వ్యవసాయాధికారి మహేష్‌చౌహాన్, గ్రామీణ నీటి సరఫరా ఏఈ వెంకటేశం, మైనర్ ఇరిగేషన్ ఏఈ నిషిత, పీఆర్ ఏఈ మధుకర్, విద్యాధికారి కృష్ణ, వైద్యం, ఇందిరాక్రాంతి పథకం, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెట్పీటీసీ పత్రి అపర్ణ, ఎంపీఓ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయ సహాయం

స్పందించిన సీనియర్ సివిల్ జడ్జి హనుమంతరావు

సాక్షి ఎఫెక్ట్


సీనియర్ సివిల్ జడ్జి హనుమంతరావుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బాధిత మహిళ

హత్నూర (సంగారెడ్డి): 'న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా' అని సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి హనుమంతరావు స్పందించారు. మేడ్చల్ జిల్లా నిజాంపేటకు చెందిన గండని బుజ్జికి భూమి పౌతి మార్పు విషయంలో రెవెన్యూ అధికారులు చేసిన ఏకపక్ష నిర్ణయంతో నష్టపోయానని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు ఆదేశాలతో సీనియర్ జడ్జి హనుమంతరావు బాధిత మహిళతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితురాలికి ఉచితంగా న్యాయ సహాయ సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న అధికారులకు అక్రమంగా పౌతి మార్పు చేయించుకున్న వారిపై విచారణ చేపడుతామని తెలిపారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

జిల్లావ్యాప్తంగా గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి బోగ్‌బండార్ నిర్వహించారు.


నారాయణఖేడ్: బోగ్‌బండార్‌లో పాల్గొన్న నాయకులు, గిరిజనులు


జిన్నారం: గిరిజన గురుకుల పాఠశాలలో...


సదాశివపేట బస్టాండ్ వద్ద...


మనూరు: సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో...


సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలో...


ఝరాసంగంలో...

ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో గురువారం రాత్రి పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో విద్యా వ్యవస్థలు లేనిసమయంలో వ్యాపారులంతా కలిసి 1974లో మొదటి పాఠశాలగా స్థాపించి విద్యార్థులకు విద్యను అందించారన్నారు. ఐదు దశాబ్దాల నుంచి ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యావంతులయ్యారని గుర్తుచేశారు. ఈ ప్రాంత వాసులకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు కల్వ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించండి


క్రీడాకారులతో కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి అన్నారు. సూర్యాపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సంగారెడ్డి జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ క్రీడాకారులకు తన సొంత నిధులతో టీ-షర్ట్‌లు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేష్ యాదవ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముక్తర్ జానీ, మాజీ అధ్యక్షులు ఎల్లయ్య, నారాయణగౌడ్, రాకేష్, శ్యామ్ పాల్గొన్నారు.

అసమానతలను నిర్మూలించాలి


నూతన కమిటీ సభ్యులతో దుర్గాప్రసాద్

జోగిపేట(అందోల్): సమాజంలో ఉన్న అసమానతలను నిర్మూలించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం పంబల్ల దుర్గాప్రసాద్ అన్నారు. జోగిపేటలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అందరికీ అందేవిధంగా చూడాలని తెలిపారు. అనంతరం ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ సమానమనే భావనతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం అందోల్ మండల, జోగిపేట పట్టణ కమిటీలను ఆ సంఘం జిల్లా, అధ్యక్ష, కార్యదర్శులు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా రాజు, పట్టణ అధ్యక్షుడిగా భుజంగరావు, మండల ఉపాధ్యక్షుడుగా ప్రవీణ్‌కుమార్, పట్టణ వైస్ ప్రెసిడెంట్‌గా మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శిగా అమరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, నవీన్, పెంటయ్య, వరప్రసాద్, అనిల్, దుర్గేష్ ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

◆ **వ్యవసాయేతర ఆదాయంగా పాడి**

వట్‌పల్లి(అందోల్): రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా అదనంగా ఆదాయం సమకూర్చుకునేందుకు రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని జోగిపేట విజయడైరీ బీఎంసీయూ ఇన్‌చార్జి నిఖిత అన్నారు. జోగిపేటకు చెందిన పాడి రైతు కుటుంబానికి విజయ డైయిరీ రైతులకు విజయ పెళ్లి కానుక ద్వారా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం రూ.5వేల చెక్కును అందజేశారు. విజయ డైయిరీ సిబ్బంది ప్రభాకర్, శ్రీను, మల్లేశం , పాషా, అశోక్ పాల్గొన్నారు.

◆ **సకాలంలో పనులు పూర్తి చేయాలి**

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ కుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత డ్రైనేజీ పనులను హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బండ్లగూడ కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి**

మునిపల్లి(అందోల్): ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ హరినందన్‌రావు అన్నారు. మండలంలోని బుదేరా, కంకోల్ గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

◆ **పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గురువారం స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ప్రతాప్‌రెడ్డి, పల్నాటి భాస్కర్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **నియామకం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మానవ హక్కుల సంరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సందీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తెల్లాపూర్‌లో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **సన్మానం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామ పంచాయతీ మాజీ పాలక వర్గ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీన, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): పదవీకాలం పూర్తిచేసుకున్న సర్పంచులకు గురువారం వట్‌పల్లిలో ఎంపీపీ పత్రి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ పత్రి అపర్ణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు, ఎంపీటీసీలు కవిత, సంగన్న, మాజీ సర్పంచులు ఖయ్యూం, నందిని, విజయ, స్వర్ణలత పాల్గొన్నారు.

◆ **యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మల్లికార్జున్**

జహీరాబాద్: నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ముల్గి మల్లికార్జున్ నియమితులయ్యారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు పార్టీని మరింత పటిష్టం చేసేందుకు పాటుపడతానని మల్లికార్జున్ తెలిపారు.

◆ **విద్యారంగానికి నిధులు కేటాయించాలి**

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవని, అధిక నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో 7.5 శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. కమిషన్ ప్రకారం విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు.

◆ **కమిషనర్ కలిసిన కౌన్సిలర్లు**

సంగారెడ్డి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను గురువారం కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, మిరుదొడ్డి రాజు, శ్రీకాంత్, నాయకులు ఉదయభాస్కర్, తులసి రామ్ పాల్గొన్నారు.

◆ **బంజారా భవన్ నిర్మాణానికి వినతి**

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో సేవాలాల్ బంజారా భవన్ నిర్మించాలని తండావాసులు కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలో తహసిల్దార్ సంజీవరావుకు వినతి పత్రం అందించారు. తండావాసులు సుభాష్ బానోత్, శివాజీ రాథోడ్, సుధాకర్ రాథోడ్, అఖిల్ రాథోడ్, గోపాల్, వినోద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇంటి పన్నులు తగ్గించండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పనులు తగ్గించాలని కోరుతూ తెల్లాపూర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణా ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన వెంట అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

◆ **సంగారెడ్డి తహసీల్దార్ బదిలీ**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి తహశీల్దార్ విధులు నిర్వహిస్తున్న ఫర్హీన్ షేక్ హత్నూర తహశీల్దార్ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నారాయణఖేడ్ తహసీల్దార్ దేవిదాస్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

◆ **సంగారెడ్డి డీపీఆర్‌ఓ బదిలీ**

సంగారెడ్డి టౌన్: డీపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి హైదరాబాద్ జీహెచ్‌ఎంసీకి పీఆర్‌ఓ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సంగారెడ్డి అడిషనల్ పీఆర్‌ఓ ఏడుకొండలు అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

◆ **హత్నూర తహసీల్దార్‌గా ఫర్హీన్ షేక్**

హత్నూర (సంగారెడ్డి): హత్నూర తహసీల్దారుగా ఫర్హీన్ షేక్ ను నియమిస్తూ అధికారులు నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన సంధ్యను అధికారులు వికారాబాద్ జిల్లాకు బదిలీ చేయగా సంగారెడ్డి ఫర్హీన్ షేక్ ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

◆ **సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీ**

సదాశివపేట (సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సదాశివపేట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏసీబీ, రైతు సంఘం మండల కార్యదర్శి భూషణం, సీఐటీయూ నాయకులు రమేష్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **అనుమానాస్పదంగా వ్యక్తి మృతి**

న్యాల్‌కల్(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. జహీరాబాద్ మండల పరిధిలోని బుర్ధిపాడ్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(37) జహీరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అనిల్‌కుమార్ ఝరాసంగం మండల పరిధిలోని మాచునూర్‌లో ఉండే తన బంధువు ప్రవీణ్ ఇద్దరు కలసి బుధవారం రాత్రి రుక్మాపూర్ గ్రామ శివారులో మద్యం తాగారు. అతర్వాత అనిల్‌కుమార్ రాత్రి అక్కడే పడిపోయాడు. ఎంతలేపినా లేవకపోవడంతో తాను భయపడి ఇంటికి వెళ్లిపోయానని అతని వెంట వచ్చిన బంధువు ప్రవీణ్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న అనిల్‌కుమార్ బంధువులు గురువారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అనిల్‌కుమార్ అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి**

కోహీర్(జహీరాబాద్): పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని డివిజనల్ పంచాయతీ అధికారి అమృత పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలలోని ప్రధాన వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆమె వెంట కార్యనిర్వాహణ అధికారి లక్ష్మణాచారి, సిబ్బంది ఉన్నారు.

◆ **అమీన్‌పూర్ తహసీల్దార్ బదిలీ**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ తహసీల్దార్‌గా రాధ బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన గౌరీ వత్సల సూపరింటెండెంట్‌గా సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మిర్యాలగూడలో డీఏఓగా పనిచేస్తున్న రాధ అమీన్‌పూర్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అదేవిధంగా పటాన్‌చెరు తహసీల్దార్‌గా రంగారావు బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన భాస్కర్ నారాయణఖేడ్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూర్యాపేట్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న రంగారావు పటాన్‌చెరు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

◆ **గురుకుల ఫలితాల్లో మెరిసిన గంగయ్య**

కల్హేర్(నారాయణఖేడ్): గురుకుల ఉద్యోగ ఫలితాల్లో కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన గంగయ్య రాష్ట్ర స్థాయిలో 9వ స్థానం సాధించాడు. గురుకులంలో పీజీటీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జోన్ పరిధిలో 2వ స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గంగయ్యను గ్రామస్తులు, మహంకాళి యువజన సంఘం సభ్యులు అభినందించారు.